

పోరాటాలకు సమాయత్తం కావాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. -8లో



ఆసక్తికరంగా అండర్-16 మ్యాచ్‌లు

ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగుతున్నాయి. చిత్తూరుతో జరుగుతున్న మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం 252 పరుగులకు ఆలౌటైంది. -8లో

గరిష్టం/కనిష్టం
32.0/24.1

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.1 - 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఏపీఎల్-2025కు కోచ్‌ల ఎంపిక



హెడ్ కోచ్ గా ఎంపికైన షేక్ ఫయాజ్ అహ్మద్



హెడ్ కోచ్‌గా నియమితులైన మధుసూదన్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్-2025 క్రికెట్ పోటీలకు జిల్లా వాసులను హెడ్ కోచ్ లుగా ఏపీఎల్ అధికారులు నియమించారు. తుంగభద్ర వారియర్స్‌కు షేక్ ఫయాజ్ అహ్మద్, సింహాద్రి వైజాగ్ లయన్స్ కు మధుసూదన్ రెడ్డిని హెడ్ కోచ్‌లుగా నియమించారు. ఈ మేరకు వారికి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఒంటిమిట్టలో ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



భోజన నాణ్యత ను పరిశీలిస్తున్న డీఈవో

ఒంటిమిట్ట: మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం డీఈఓ షంషుద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని మంటపంపల్లి, కొత్త మాధవరం, ఒంటిమిట్ట గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో శుభ్రతతో పాటు మధ్యాహ్నం భోజన నాణ్యత, విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానాన్ని పరిశీలించారు. కొత్త మాధవరం జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించడంపై అసహనం వ్యక్తం చేశారు. మండల ప్రత్యేక అధికారి బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఈలకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతులు

కడప కార్పొరేషన్: పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంటులో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న పలువురికి పదోన్నతులు కల్పిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో డీఈగా పనిచేస్తున్న విజయ్ కుమార్ రెడ్డికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పదోన్నతి కల్పించి కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. కడప కార్పొరేషన్ లో ఈఈగా పనిచేస్తున్న ఎం.నారాయణ స్వామిని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కు బదిలీ చేశారు. పులివెందుల పబ్లిక్ హెల్త్ సబ్ డివిజన్‌లో డీఈగా ఉన్న కరిముల్లా ఖాన్‌కు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పించి కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీకి డిప్యూటేషన్ వేశారు. కడప కార్పొరేషన్‌లో డీఈ గా ఉన్న జి.చంద్రశేఖర్‌కు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పదోన్నతి కల్పించి అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కు బదిలీ చేశారు.

సౌమ్యనాథస్వామికి రూ.6, 06,780 ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

నందలూరు: నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 40 రోజులకు సంబంధించి వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ.6,06,780 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేయనున్నట్లు చెప్పారు. ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన, భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టు డిపాజిట్లు రూ.2,24,13,591

మండలంలోని శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం సమీపంలోని సౌమ్యనాథ అన్నదాన ట్రస్టు డిపాజిట్లు బ్యాంకు ఖాతాల్లో రూ.2,24,13,591 ఉన్నట్లు ట్రస్టు అధ్యక్షుడు ఎద్దుల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శనివారం, ఆదివారం అన్నదానం నిర్వహిస్తున్నామని, శుక్రవారం కూడా భక్తులకు భోజనాలు ఏర్పాటు చేసేందుకు తీర్మానించినట్లు చెప్పారు.అన్నదాన సత్రంలో పనిచేస్తున్న వారికి జీతాలు పెంచామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శైలేంద్రనాథ్, సభ్యులు గంట వాసుదేవయ్య, జంగంశెట్టి వెంకటసుబ్బయ్య, పల్లె సుబ్రమణ్యం, సర్దార్ హుస్సేన్, మోడపోతుల రాము, లంకాయగారి సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఈ మహిళా రైతు పేరు పామిడి వరలక్ష్మి. ఈమెది పెద్దముడియం మండలం కల్వటాల గ్రామం. ఆ గ్రామంలో సర్వే నంబర్ 306లో 2.69 ఎకరాలు భూమి ఉంది. 'షెల్'సోలార్ కంపెనీ వారు ఆమె అనుమతులు లేకుండా పొలంలో 6 అడుగుల లోతు రంధ్రాలు వేశారు. అందులో సిమెంటు దిమ్మెలతో సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదేంటని అడిగితే భూమిని కంపెనీకి లీజు రూపంలో ఇవ్వాలని ఒత్తిడి చేశారు. తమకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.. లీజుకిస్తే వారి వివాహాలకు ఇబ్బందవుతుంది.. ఇతర రైతుల భూములు కొనుగోలు చేసినట్లుగా తమ భూమి కొనుగోలు చేయాలని కోరింది. అలా కుదరదు మీ భర్త సంతకాలు తీసుకున్నాం. మీరు సంతకాలు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఆపై బెదిరింపులకు దిగుతున్నారు.





రిమాండ్‌కు వెళ్లిన మధుసూదనరెడ్డి

అదే గ్రామానికి చెందిన అక్కంరెడ్డి సుజాత పేరిట ఉన్న భూమిలో ఎలాంటి సమాచారం లేకుండా కనీస అనుమతి లేకుండా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు కంపెనీ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆమె భర్త మధుసూదన్‌రెడ్డితో కలిసి పొలం వద్దకు వెళ్లి పనులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా తమ భూమిలో ఎలా పనులు చేస్తారంటూ నిలదీశారు. అంతే సదరు కంపెనీ ప్రతినిధులు పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి మధుసూదనరెడ్డిపై నాన్‌బెయిల్‌బుల్ కేసు నమోదు చేయించి, రిమాండ్‌కు పంపించారు. 33రోజులు భర్త రిమాండ్‌లో ఉండడంతో సుజాత జిల్లా యంత్రాంగాన్ని కలిసి మొరపెట్టుకుంది. ఎవరు కనికరించలేదు. కలెక్టర్ సైతం పట్టించుకోలేదు. ఈ రెండు కుటుంబాలే కాదు... కల్వటాల గ్రామంలో చాలా మంది రైతుల దుస్థితి ఇది.

కల్వటాలలో షెల్.. చల్!

- అక్రమ కేసులతో భయోత్పాతం
- అనుమతులు లేకుండానే హద్దులు ఏర్పాటు
- ప్రభుత్వ, ప్రైవేటు భూములు దర్జాగా స్వాహా
- ఇదీ షెల్ సోలార్ ప్లాంట్ ప్రతినిధుల తీరు
- కంపెనీకి అండగా కూటమి నేతలు



సాక్షి ప్రతినిధి, కడప: కూటమి నేతల అండ చూసుకుని షెల్ సోలార్ కంపెనీ ప్రతినిధులు పేద రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. వారి సొంత భూములపై కూడా హక్కుల్లేకుండా చేస్తున్నారు. అడిగితే బెదిరిస్తున్నారు. ఇంకా ముందుకెళ్లి అక్రమ కేసులూ పెడుతున్నారు. నోరున్నోళ్లకు మాత్రమే కాస్తా వెనక్కి తగ్గుతున్నారు.

- కడప-నంద్యాల జిల్లాల సరిహద్దుల గ్రామాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం షెల్ కంపెనీ ముందుకు వచ్చింది. పెద్దముడియం మండలం కల్వాటాల గ్రామం పంట పొలాల్లో ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. భూములు ఇచ్చేందుకు రైతులు సుముఖత చూపలేదు. దాంతో 30ఏళ్లకు లీజుకు ఇవ్వాలని ఎకరానికి రూ.32వేలు లీజు చెల్లిస్తామని ముందుకు వచ్చారు. అయినప్పటికీ రైతులు లీజుకు ఇచ్చేందుకు అంగీకరించలేదు. వెంటనే దళారులను ప్రవేశ పెట్టి రైతుల మధ్య ఉన్న అనైక్యతను సొమ్ము చేసుకునేందుకు సన్నాహాలు చేశారు. వారి వ్యూహం ఫలించి, కొంతమంది రైతులు సోలార్ కంపెనీకి అనువుగా లీజుకు భూములిచ్చారు. మరి కొందరు తమకున్న ఆదరువు భూమి ఒక్కటేనని.. ఉన్న భూమికి మీకు అప్పగించలేమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇవేవి పట్టించుకునే పరిస్థితిలో షెల్ కంపెనీ ప్రతినిధులు లేరు, వారికి అండగా నిలుస్తోన్న కూటమి సర్కార్ నేతలకు అస్సలు లేదు. బెదిరింపులకు దిగుతూ, దౌర్జన్యాలకు పాల్పడుతూ ఇష్టం లేకపోయినా కొందరు రైతుల నుంచి భూములు స్వాధీనం చేసుకున్నారు.

అడ్డం తిరిగిన రైతులకు అందలం...

నోరున్నోడిదే రాజ్యం, బలం ఉన్నోడికే అండగా నిలుస్తారని కల్వాటాల గ్రామంలో మరోమారు రుజువయ్యింది. తమ భూమిలోకి దిగొద్దు, తాము లీజుకు ఇవ్వం అన్నోళ్లకు.. మీరెవరికీ చెప్పొద్దంటూ ఎకరం రూ.14లక్షలు చెల్లించి కొనుగోలు చేశారు. ఇలా అందరికి అదే స్థాయిలో చెల్లించి భూములు కొనుగోలు చేశారా? అంటే అదీ లేదు. కొందరికి ఎకరం రూ.8లక్షలకు కూడా కొనుగోలు చేసి, స్వాధీనం చేసుకున్న భూములు కూడా ఉన్నాయి.

» అక్రమాలను అడ్డుకునేవారేరీ!

రైతులకు తెలియకుండానే వారి భూముల్లో స్తంభాలు వెలిశాయి. పెంచుకున్న చీనీ చెట్లు నేలకొరిగాయి. ఇదేమి అన్యాయమంటూ కొంతమంది రైతులు పెద్దముడియం పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించి, ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదులు బుట్టదాఖలయ్యాయి. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేసుకోవాలని ఉచిత సలహాలు తెరపైకి వచ్చాయి. ఒక్కరో ఇద్దరో రైతులు అడ్డం తిరిగితే వారిపై అధికార పార్టీ నాయకుల్ని ప్రయోగిస్తున్నారు. అప్పటికీ వినిపించుకోకపోతే అలాంటి వారిపై అక్రమ కేసులు తెరపైకి వస్తున్నాయి. పాపం రైతులు...ఎవరూ పట్టించుకోకపోవడంతో దిగాలు పడుతున్నారు.

రైతులకు సకాలంలో ఎరువులందాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: రైతులకు ఎరువులు సకాలంలో అందేలా చూడాలని వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎరువుల నిల్వలు,విక్రయాలు, మార్కెటింగ్, పంటలు తదితర అంశాలపై వ్యవసాయ, మార్కెటింగ్, డీఎస్‌ఓ శాఖా అధికారులు, ప్రైవేట్ ఎరువుల కంపెనీల ప్రతినిధులుతో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎరువులు అవసరమైన మేర స్టోరేజీ అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిమాండ్ ఆధారంగా ఎరువులు ఆర్బీకేల ద్వారా అందజేస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఆర్బీకేలలో 2900 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలన్నారు. ప్రైవేటు ఎరువుల డీలర్లు నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ ఈ-పాస్ యంత్రాల ద్వారా మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. బల్క్‌స్టాక్ పెట్టుకుని కృత్రిమ కొరత సృష్టించడం వంటి పనులకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఎంత ఎరువులు అలాట్మెంట్ ఉంది,రైతులకు ఏ మేరకు విక్రయించారు, ప్రస్తుతం ఎంత అందుబాటులో ఉందనే వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల వారీగా ఆర్బీకేలలో స్టాక్ వివరాలను ప్రతిరోజు మీడియా ద్వారా రైతులకు తెలియజేయాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ జేడీ చంద్రా నాయక్, మార్కెటింగ్ ఏడీ ఆజాద్ వల్లి,మార్క్ ఫెడ్ డీఎం పరిమళజ్యోతి, హార్టికల్చర్ అధికారి రవిచంద్రబాబు, డీసీఓవెంకటసుబ్బయ్య, కోర మాండల్, స్పిక్, ఐపీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటాం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, సుగవాసి బాల సుబ్రమణ్యం, తదితరులు

- వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి
- రమేష్‌కుమార్ రెడ్డిని పరామర్శించిన పార్టీ సీనియర్ నాయకులు

లక్కిరెడ్డిపల్లి: ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కలిసికట్టుగా ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, పార్టీ నాయకుడు సుగవాసి బాల సుబ్రమణ్యంలతో కలిసి మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ గొంతునొక్కే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోందని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. ప్రజల పక్షాన నిలబడటానికి ఎన్ని కేసులైనా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కూటమి ప్రభుత్వంపై పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించడానికి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపైన అక్రమ కేసులు పెడుతూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని, పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారని, కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ శాఖ సలహా మండలి మాజీ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ స్టేట్ సెక్రటరీ గాలివీటి వీరనాగిరెడ్డి, రాజంపేట అసెంబ్లీ పబ్లిసిటీ వింగ్ మాదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, మాన్యం సంతోష్ రెడ్డి,పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీపీలు అంబాబత్తిన రెడ్డయ్య, తిమ్మిరెడ్డి ఉమాపతి రెడ్డి, ఉప మండల అధ్యక్షులు సమరసింహారెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకే అక్రమ అరెస్టులు

వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ షేక్ ఇస్మాయిల్



కమలాపురం: రాష్ట్రంలో నెలకొన్న సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కూటమి సర్కార్ వైఎస్సార్ సీపీ నేతలను అక్రమ అరెస్టులు చేస్తోందని ఆ పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ షేక్ ఇస్మాయిల్ అన్నారు. మంగళవారం ఆయన కమలాపురంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఈ సర్కార్ అక్రమంగా అరెస్ట్ చేసిందని మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్ సీపీని అడ్డుకోలేరని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా విజయం తమ పార్టీదేనని స్పష్టం చేశారు. ఈ అక్రమ అరెస్టులపై రాష్ట్ర ప్రజలు కూడా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఎన్నికల సమయంలో జవాబు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులు ఆపి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై , రాష్ట్ర సమస్యల పై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు. సూపర్ సిక్స్ అమలుపై ప్రశ్నించకూడదని భావించిన కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైఎస్సార్ సీపీ నేతలను అక్రమంగా అరెస్టులు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జీతాలు ఎప్పుడిస్తారు!

- బదిలీ టీచర్లకు వేతన కష్టాలు
- పొజిషన్ ఐడీల కేటాయింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం
- బదిలీలు జరిగి నెలరోజులైనా ఇవ్వని ఐడీలు
- జిల్లాలో వేలాదిమంది టీచర్ల కుటుంబాలపై ప్రభావం



ఇటీవల ఉపాధ్యాయులకు జరిగిన బదిలీ కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: బదిలీలు ఉపాధ్యాయులకు శాపంగా మారాయి. ఈ ఏడు బదిలీల ప్రక్రియ ప్రారంభం నుంచి ఏదో ఒక సమస్యలు ఎదుర్కొంటున్న గురువులకు.. తాజాగా జీతాల సమస్య వారిని తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. స్థాన చలనం కలిగిన వారికి జీతాల చెల్లింపులో తీవ్రజాప్యం జరుగుతోంది. బదిలీ అయిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడంతో వారికి జీతాలు పడట్లేదు. బదిలీల సాకుతో ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

బదిలీ అయిన ప్రాంతాల్లో....

ఉద్యోగులైనా.. ఉపాధ్యాయులైనా సాధారణంగా బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా ఆ ప్రాంతంలోని డీడీఓలకు సమాచారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది, దీని కోసం ఉపాధ్యాయులకు ఐడీలు కేటాయించాలి. బదిలీ ప్రక్రియ పూర్తయి నెల రోజులు దాటినా ఇంత వరకు చాలామంది ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలను కేటాయించలేదు. పాఠశాలల ప్రారంభమైన జూన్ నెలలో ప్రతి కుటుంబంలో ఖర్చులు ఎక్కువగానే ఉంటాయి. విద్యా సంవత్సరం ప్రారంభంతో పిల్లల స్కూల్ ఫీజులు, విద్యా సామగ్రి, దుస్తులు ఇలా వేలకు వేలు వెచ్చించాల్సి ఉంటుంది. అలాగే బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయాణ ఖర్చులు, ఇంటి అద్దెలు ఇలా పలు రకాల ఖర్చులు తడిసి మోపెడవుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో నానా అగచాట్లు పడుతున్నామని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4217 మంది...


ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4217 మంది వివిధ క్యాడర్లలో ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వీరిలో 202 మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు కాగా, 1815 మంది స్కూల్ అసిస్టెంట్లు, 2047 మంది సెకండ్ గ్రేడ్ టీచర్స్, 114 మంది లాంగ్వేజ్ పండిట్లు, 11 మంది ఏఆర్‌టీ, క్రాఫ్ట్, మ్యూజిక్, ఒకేషన్ ,28 మంది ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు ఇలా మొత్తంగా ఉమ్మడి జిల్లాలో జూన్ 15 నాటికి 4217 మంది వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వీరిలో కొత్తగా ఏర్పడిన మోడల్ ప్రైమరీ స్కూళ్లకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు బదిలీ అయ్యారు. అలాగే మోడల్ ప్రైమరీ పాఠశాలలు, హైస్కూళ్లు కొత్తగా ఏర్పడటంతో ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించాల్సి ఉంది. ఇలా జిల్లావ్యాప్తంగా 1000 మంది వరకు ఉన్నట్లు తెలిసింది. వీరందరికీ ఇప్పుడు జీతాలు పడలేదు. ఈ విషయంపై డీఈఓను వివరణ కోరగా బదిలీ అయిన వారి వివరాలను కమిషనర్ కార్యాలయానికి పంపించామని.. ఈ నెలాఖరుకంతా సమస్య పరిష్కారం అవుతుందని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు.

» జీతాల చెల్లింపులో జాప్యం తగదు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా గత జూన్ మాసంలో జరిగిన ఉపాధ్యాయ బదిలీల ద్వారా ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయుల జీతాలు చెల్లింపులో ఆలస్యం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్,పాళెం మహేష్ బాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. జీతాలు చెల్లించుటకు అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బదిలీలకు ముందే ఏ పోస్టు ఏ పాఠశాలకు షిఫ్ట్ అవుతుందో విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలిసినా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవడంలో జాప్యం చేశారని మండిపడ్డారు. జిల్లా సహాధ్యక్షులు వై రవికుమార్,డి సుజాత రాణి జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహమ్మద్, ప్రసన్న లక్ష్మి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, రూతు ఆరోగ్యమేరీ నాయకులు గాజులపల్లి గోపీనాథ్, రామకేశవ, వీర నారాయణ, శంకర్ రెడ్డి, దేవదత్తం,ఈశ్వర రావు, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లపై రాజధాని నిర్మిస్తున్నారు

- ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అనుమానాలున్నాయి
- రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగాయి
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆగ్రహం



మాట్లాడుతున్న చింతామోహన్

కడప రూరల్: టీడీపీ కూటమి ప్రభుత్వం అమరావతిలో నీళ్లపై రాజధాని నిర్మిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ వ్యాఖ్యానించారు. మంగళవారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలో మూరెడు మట్టి తీస్తే.. చారెడు నీళ్లు వస్తున్నాయని తెలిపారు. దేవతల నగరం అంటున్నారని, అక్కడ మాత్రం కర్రతుమ్మ చెట్లు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 20 జిల్లాల ప్రజల్లో రాజధానిపై అసంతృప్తి ఉందన్నారు. రాయలసీమలో పరిపాలనా రాజధాని, విశాఖపట్నంలో హైకోర్టును ఏర్పాటు చేస్తే బాగుంటుందని, ఆ దిశగా సీఎం చంద్రబాబు ఆలోచించాలని సూచించారు. రాయలసీమలో ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని పూర్తి చేశాక, బనకచర్ల అంశాన్ని పరిశీలించాలన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల ప్రాథమిక పాఠశాలలు మూతబడ్డాయని, మరో 5 వేల పాఠశాలలను మూత వేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 3 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్య అందని పరిస్థితి ఏర్పడటం చాలా బాధాకరమన్నారు. విద్యార్థులకు ఉపకారవేతనాలు అందడం లేదన్నారు. బీటెక్, ఎంబీఏ చదివిన విద్యార్థులు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవీఎంలపై వస్తున్న విమర్శలు కరెక్టే అన్నారు. తిరుపతి లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో కొంతమంది తన వద్దకు వచ్చి.. ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపిస్తామని చెబితే ఆశ్చర్యపోయానని అన్నారు. వారు చెప్పిన కొన్ని ఉదాహరణలు వింటే నిజమే అనిపించిందన్నారు. మోడరన్ టెక్నాలజీ ద్వారా, రిమోట్‌తో టీవీని కంట్రోలు చేసే విధంగా ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయవచ్చని వివరించారన్నారు. అందుకు ప్రతిఫలంగా వారు రాజకీయంగా పెద్ద పెదవినే కోరడంతో వారికి ఒక దండం పెట్టి నాకీ సమస్యలు వద్దని చెప్పానని పేర్కొన్నారు. ప్రతిపక్షం బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో, కీలకమైన ప్రదేశాల్లో ట్యాంపరింగ్ ద్వారా ఓడిపోయే వారిని గెలిపిస్తున్నట్లుగా తెలిసిందన్నారు. అలాగే ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరిశ్రమలకు సంబంధించి రూ. 14.50 లక్షల కోట్లు ఎన్‌పీఎల్ అయ్యాయని చింతా మోహన్ అన్నారు. ఇందుకు సంబంధించి కేంద్రం రుణ మాఫీ చేసిందని తెలిపారు. అందుకు గాను 10 శాతం డబ్బును వసూలు చేశారని ఆరోపించారు. గుజరాత్‌కు చెందిన వారికే ఎక్కువగా రుణ మాఫీ జరిగిందన్నారు. ఇందులో లక్షలాది రూపాయల అవినీతి జరిగిందని, దీనిపై దర్యాప్తు చేయాలని కోరారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు



కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా మంగళవారం చెన్నూరులో అత్యధికంగా 45.2 మి.మీ వర్షం నమోదైయింది. అలాగే సిద్దవటంలో 27.2, మైదుకూరులో 22.4, ఒంటిమిట్టలో 21.2, కొండాపురంలో 14.4, తొండూరులో 11.4, వల్లూరులో 11.2, సికెదిన్నెలో 9.8, కమలాపురంలో 9.2 , వీఎన్‌పల్లిలో 8.6, సింహాద్రిపురంలో 8.4 , అట్లూరులో 8 , ఖాజీపేటలో 6.8, పెండ్లిమర్రిలో 6 , కడపలో 5.4 , వేంపల్లిలో 5.2 , చాపాడులో 2.6 , ఎర్రగుంట్లలో 1.6 , బి.మఠంలో 1 మి.మీ వర్షం నమోదైయింది.

క్లుప్తంగా

బాలిక హత్య కేసులో పదేళ్ల జైలు శిక్ష



నిందితుడు విశ్వనాథంతో పోలీసు

కడప అర్బన్‌ : కడప నగరం ఆర్టీసీ బస్టాండ్‌ సమీపంలో మూడేళ్ల బాలికను హత్య చేసిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతోపాటు 1000 రూపాయలు జరిమానా విధిస్తూ నాలుగో అదనపు జిల్లా కోర్టు, ఎస్సీ ఎస్టీ సెల్‌ జడ్జి మంగళవారం తీర్పునిచ్చారు. కర్నూలుకు చెందిన కత్తెర విశ్వనాథం కూలి పనుల కోసం కడప ఆర్టీసీ బస్టాండ్‌ సమీపంలో అద్దె ఇల్లు తీసుకొని నివాసం ఉంటున్నాడు. విశ్వనాథం బంధువు సుజాత కూడా అక్కడే ఉండేది. సుజాత కుమార్తె శ్రీలత (3) రాత్రి సమయంలో నిద్రకు భంగం కలిగిస్తుందన్న ఉద్దేశంతో ఆ బాలికను దారుణంగా హత్య చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు చిన్న చౌక్‌ పోలీస్‌ స్టేషన్‌లో 2017 ఫిబ్రవరి నెలలో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి వాదోపవాదాలు విన్న జడ్జి నేరం రుజువు కావడంతో విశ్వనాథంకు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

మద్యం దుకాణంలో టాస్క్‌ఫోర్స్‌ తనిఖీలు



ల్యాబ్‌కు పంపేందుకు సీజ్‌ చేసిన మద్యం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మైదుకూరు రోడ్డులోని భూమిరెడ్డి వైన్స్‌ షాపులో మంగళవారం సాయంత్రం స్టేట్‌ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మద్యం కల్తీ జరుగుతోందని ఆరోపణలు రావడంతో విజయవాడ టాస్క్‌ఫోర్స్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మధుబాబు సిబ్బందితో కలిసి సోదాలు చేశారు. ఎక్కువ రేటు గల మద్యం సీసాల్లో తక్కువ ధర కలిగిన మద్యాన్ని నింపి కల్తీ చేస్తున్నారని కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో టాస్క్‌ఫోర్స్‌ అధికారులు మద్యం షాపును తనిఖీ చేశారు. ఈ మేరకు రెండు మద్యం సీసాలను సీజ్‌ చేశారు. వీటిని పరీక్షల నిమిత్తం కర్నూలు ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ల్యాబ్‌ రిపోర్టు రెండు, మూడు రోజుల్లో వస్తుందని, కల్తీ జరిగినట్లు నిర్ధారణ అయితే మద్యం షాపుపై చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు ఎక్సైజ్‌ సీఐ సురేంద్రారెడ్డి తెలిపారు.

సోమశిలలోకి కృష్ణమ్మ పరుగులు!

- 27.616 టీఎంసీలు నిల్వ
- డ్యాంలోకి ఇన్‌ఫ్లో 3,055 క్యూసెక్కులు



జలాశయంలోకి చేరుతున్న కృష్ణా జలాలు

రాజంపేట : సోమశిలలోకి కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. సోమవారం నమోదైన 3, 055 క్యూసెక్కుల ప్రవాహం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. అధికారుల అంచనా కన్నా ముందే జలాలు సోమశిలకు చేరుతున్నాయి. కర్నూలు జిల్లాలో కురుస్తున్న వర్షాలతో కుందూ నది ద్వారాను కలిసొచ్చే అవకాశం కనిపిస్తోంది.

ఆదినిమ్మాయపల్లె వద్ద..

ఈ ఏడాది జూలై నెలలోనే కృష్ణానదికి వరదలు ఉధృత్యంగా వచ్చాయి. దీంతో శ్రీశైలం జలాశయం నిండిన సంగతి విదితమే. సాగర్‌కు నీటిని విడుదల చేశారు. అవి కాస్తా పెన్నా (సిద్దవటం, ఒంటిమిట్ట) ద్వారా సోమశిలకు చేరుతున్నాయి. శ్రీశైలంలో 203.43 టీఎంసీలు ఉండగా, జలాశయంలోకి 1,75,233 క్యూసెక్కులు వస్తోంది. దాంతో తెలుగు గంగకు విడుదలను మరింత పెంచే అవకాశం ఉంది. అదే స్థాయిలో సోమశిలకు రానున్నాయి. కడప జిల్లా ఆదినిమ్మాయపల్లె వద్ద పెన్నాలో 1800 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది.

27.616 టీఎంసీల నిల్వ..

సోమశిలలో 27.616 టీఎంసీల నీటి నిల్వ ఉండగా , కృష్ణా జలాలు జత కావడంతో జలాశయంలోకి 3,055 క్యూసెక్కుల ప్రవాహమే ఉంది. జూలైలో వర్షాల కారణంగా ప్రవాహం క్రమంగా పెరిగే పరిస్థితి ఉంది. సోమశిల ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందనుంది. ఇన్‌ఫ్లో క్రమంగా పెరిగే అవకాశం ఉందని జలాశయం అధికారులు అంటున్నారు.

వెనుక జలాలు నిలకడగా..

సోమశిల జలాశయం కెపాసిటీ 77.988 టీఎంసీగా ఉంది. జలాశయంలో నీటి మట్టం 90,879 మీటర్ల వద్దకు చేరుకుంది. అన్నమయ్య, కడప జిల్లాలో విస్తరించి ఉన్న అట్లూరు, ఒంటిమిట్ట, నందలూరు మండలాల పరిధిలో వెనుక జలాలు నిలకడగానే ఉన్నాయి.

వివాహేతర సంబంధంతోనే మహిళ హత్య

వివరాలు వెల్లడించిన మైదుకూరు రూరల్‌ సీఐ శివశంకర్‌



నిందితుడితో రూరల్‌ సీఐ శివశంకర్‌, ఏఎస్‌ఐ బాషా

చాపాడు : వివాహేతర సంబంధాలు పెట్టుకుందనే కారణంతో మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో ఈ నెల 17న నల్లబోతుల సుజాత (37) అనే వివాహితను ఆమె భర్త గోపాల్‌ హత్య చేసినట్లు మైదుకూరు రూరల్‌ సీఐ శివశంకర్‌ తెలిపారు. ఈ హత్య కేసులో భర్త గోపాల్‌ను మంగళవారం అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపరచారు. మంగళవారం రూరల్‌ సీఐ వివరాలను వెల్లడించారు. 20 ఏళ్ల క్రితం గోపాల్‌ చియ్యపాడు గ్రామంలోనే ఉన్న తన అక్క గుజ్జల పార్వతమ్మ పెద్ద కూతురు సుజాతను వివాహం చేసుకున్నాడు. పదేళ్ల పాటు అన్యోన్యంగా జీవిస్తున్న వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. గత కొన్నేళ్ల క్రితం నుంచి తన భార్య సుజాత ఇతరులతో వివాహేతర సంబంధాలు పెట్టుకుందనే అనుమానంతో గోపాల్‌ తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 17న రాత్రి 11.30 గంటల ప్రాంతంలో భార్యతో గొడవపడ్డ గోపాల్‌ టవల్‌తో తన భార్య గొంతుకు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. మృతదేహాన్ని గోనె సంచిలో కట్టుకుని తనకున్న ఏపీ04ఏఏ4288 నెంబరు గల స్కార్పియో కారులో తీసుకెళ్లి మైదుకూరు మండలం పోరుమామిళ్ల రహదారిలోని ముదిరెడ్డిపల్లె సమీపంలో ఎద్దడుగు కనుమ అటవీ ప్రాంతంలోని మట్టి కాలువలో పడేశాడు. ఇంట్లో, గ్రామంలో సుజాత కనిపించకపోవడంతో తన తల్లి గుజ్జల పార్వతమ్మ తన అల్లుడు గోపాల్‌పై అనుమానంతో గాలించింది. అతను పరారీలో ఉండంతో ఈ నెల 19న చాపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టగా గోపాల్‌ తన భార్యను హత్య చేసినట్లు తేలిందన్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం కుందూనది సమీపంలోని చియ్యపాడు క్రాస్‌ రోడ్డు వద్ద వాహన తనిఖీ చేస్తుండగా నిందితుడైన గోపాల్‌ తన స్కార్పియో వాహనంలో పారిపోతుండగా పోలీసు సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు రూరల్‌ సీఐ తెలిపారు.

పోరాటాలకు సమాయత్తం కావాలి



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- బద్వేలులో ప్రారంభమైన సీపీఐ జిల్లా మహాసభలు

బద్వేలు అర్బన్‌ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాబోవు రోజుల్లో లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలను కూడగట్టుకుని పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సీపీఐ 25వ జిల్లా మహాసభల సందర్భంగా మంగళవారం పట్టణంలోని మార్కెట్‌యార్డు నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

కార్పొరేట్‌ కంపెనీలకు దోచి పెడుతున్న మోదీ..

కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం పేద ప్రజల, రైతుల, కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి కేవలం కార్పొరేట్‌ వర్గాల సేవలో పరితపిస్తోందని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనం వెలికి తీస్తామని చెప్పిన మోదీ ఇప్పటి వరకు ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చారో, ఎంత నల్లధనం వెలికి తీశారో సమాధానం చెప్పాలన్నారు. పేదలకు అనుకూలంగా ఆర్థిక విధానాలు రూపొందించాల్సింది పోయి మత విద్వేషాలు సృష్టిస్తూ పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న చంద్రబాబు..

గత ప్రభుత్వ హయాంలో చేస్తున్న అప్పులను ఉద్దేశించి రాష్ట్రం శ్రీలంకగా మారిపోతుందని అన్న చంద్రబాబునాయుడు నేడు అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ.1.75 లక్షల కోట్లు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. ప్రతిపక్షంలో ఉంటే ఒక మాట, అధికారంలో ఉంటే మరో మాట మాట్లాడటం చంద్రబాబు నైజమన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే ట్రూఅప్‌ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం విద్యుత్‌ వినియోగదారులపై ఇంత భారం ఏ ప్రభుత్వం మోపలేదన్నారు. చంద్రబాబునాయుడు గతంలో మాదిరిగానే గాలిలో మేడలు కడుతున్నారే తప్ప రాష్ట్రాభివృద్ధిపైన ఏ మాత్రం దృష్టి సారించడం లేదని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జాతీయ సమితి సభ్యుడు శివారెడ్డి, జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్‌, నాగసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, రామయ్య, వెంకటశివ, బాదుల్లా, భాగ్యలక్ష్మి, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్‌, పట్టణ, రూరల్‌ కార్యదర్శులు బాబు, ఇమ్మానియేలు, ఏరియా కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో మంగళవారం మధ్యాహ్నం ఎస్‌ఐ శివప్రసాద్‌ సిబ్బందితో కలిసి బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. బ్రహ్మంసాగర్‌కు వెళ్లేదారిలో ఓ బెల్టు షాపు దుకాణంలోకి వెళ్లగా అక్కడ షాపు నిర్వాహకుడు పరారయ్యాడు. బెల్టుషాపులో 35 క్వార్టర్‌ బాటిళ్లు, వివిధ రకాల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రహరీ విషయమై ఇరువర్గాల వివాదం

పులివెందుల టౌన్‌ : పులివెందుల పట్టణంలోని బొగ్గుడుపల్లె రోడ్డు సమీపంలో ప్రార్థనా మందిరాల ప్రహరీ విషయమై ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. గతంలోనూ ప్రార్థనల విషయమై వివాదం తలెత్తగా పోలీసులు ఇరు వర్గాల వారికి సర్ది చెప్పి పంపారు. తాజాగా మంగళవారం ప్రహరీ విషయమై మరోమారు ఇరువర్గాల మధ్య వివాదం మొదలైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాల వారిని పోలీస్‌ స్టేషన్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీ నాయక్‌ ఇరువర్గాలతో చర్చించారు. అనంతరం ఆయన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బుధవారం ఆర్డీఓ, తహసీల్దార్‌ల సమక్షంలో సర్వే చేసి ఈ సమస్యను పరిష్కరిస్తామని డీఎస్పీ తెలపడంతో ఇరు వర్గాల వారు వెళ్లిపోయారు. డీఎస్పీ వెంట సీఐలు చాంద్‌ బాషా, హాజీవలి, ఎస్‌ఐ నారాయణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్టు

– కత్తి, మోటార్‌ సైకిల్‌, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న చిన్న చౌక్‌ సీఐ ఓబులేసు

కడప అర్బన్‌ : కడప నగరం గంజికుంట కాలనీలో గత నెల 25వ తేదిన గొంటుముక్కల వెంకటసుబ్బయ్యపై కత్తితో దాడి చేసిన కేసుకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌక్‌ సీఐ ఓబులేసు తెలిపారు. చిన్నచౌక్‌ పోలీస్‌ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో సీఐతో పాటు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌ రెడ్డి వివరాలు వెల్లడించారు. కడప మాసాపేటకు చెందిన తాటిగిరి అనూష, పాలెం సుబ్బరాయుడు అలియాస్‌ సుబ్బన్న, చింతకొమ్మదిన్నె మండలం నరసరామయ్యగారిపల్లికి చెందిన సోమ ప్రశాంత్‌, సుగమాల నవీన్‌ అలియాస్‌ శిగనమాల నవీన్‌, సిబ్యాల సుబ్బరాయుడు మాసాపేటకు చెందిన తాటిగిరి నిర్మలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కత్తి, మోటార్‌ సైకిల్‌, 4 సెల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వెంకటసుబ్బయ్య, తాటిగిరి అనూష మధ్య మనస్పర్థలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో గత నెల 25వ తేదీ వెంకటసుబ్బయ్యపై కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

అమరావతి అవినీతిపై విచారణ చేయించాలి

– సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వైఎస్సార్‌సీపీ నాయకుల లేఖ



రిజిస్టర్‌ పోస్టు చేసిన లేఖను చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్‌ : అమరావతి రాజధాని పేరుతో జరుగుతున్న అవినీతిపై సీబీఐ, ఈడీ విచారణకు ఆదేశించాలని వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి పి. సంపత్‌ కుమార్‌, చైతల్య కోరారు. మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వారు లేఖ రాసి రిజిస్టర్‌ పోస్ట్‌ చేశారు. అమరావతిలో జరుగుతున్న అవినీతిపై స్పష్టమైన ఆధారాలు ఉన్నాయన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రభుత్వంతో పొత్తులో ఉన్నందున వారు విచారణ చేసే అవకాశం లేదన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని విచారణకు ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శివప్రసాద్‌, మార్కెట్‌ యార్డు మాజీ డైరెక్టర్‌ గోపాలక్రిష్ణ పాల్గొన్నారు.

ఆసక్తికరంగా అండర్‌–16 మల్టీ డే మ్యాచ్‌లు



రాక్‌సన్‌ సాయి, చిత్తూరు (6 వికెట్లు)



గైబు, కడప (6 వికెట్లు)

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : ఏసీఏ అండర్‌–16 మల్టీ డే మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగుతున్నాయి. వైఎస్‌ఆర్‌ ఆర్‌ క్రికెట్‌ స్టేడియంలో అనంతపురం–చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో రెండో రోజు మంగళవారం రెండవ ఇన్నింగ్స్‌ ప్రారంభించిన అనంతపురం జట్టు 66.3 ఓవర్లకు 252 పరుగులకు ఆలౌట్‌ అయింది. ఆ జట్టులోని ఆదినారాయణ రెడ్డి 69 పరుగులు, కౌశిక్‌ 51 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని రాక్‌సన్‌ సాయి అద్భుతంగా బౌలింగ్‌ చేసి 6 వికెట్లు, జయ్‌ప్రకాశ్‌ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌ ప్రారంభించిన చిత్తూరు జట్టు 26 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేశాడు. మహ్మద్‌ షారుఖ్‌ అక్తర్‌ 47 పరుగులు చేశాడు. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

కేఓఆర్‌ఎం క్రికెట్‌ మైదానంలో...

కేఓఆర్‌ఎం క్రికెట్‌ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కడప– నెల్లూరు జట్లు తలపడుతున్నాయి. 73 పరుగుల ఓవర్‌ నైట్‌ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన నెల్లూరు జట్టు 69.2 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌట్‌ అయింది. ఆ జట్టులోని వెంకట్‌ రిషిత్‌ 44 పరుగులు చేశాడు. కడప జట్టులోని గైబు చక్కటి లైనప్‌తో బౌలింగ్‌ చేసి 6 వికెట్లు తీశాడు, హితేష్‌ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌ ప్రారంభించిన కడప జట్టు 37 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసింది. ఫర్హాజ్‌ ఖాన్‌ లోడి 44 పరుగులు, జయప్రణవ శాస్త్రి 13 పరుగులు చేశారు. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

గండి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ల ఏర్పాట్లు

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన గండిలో శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలయ అధికారులు, పాలకవర్గం ఇప్పటికే పోలీసు, పారిశుద్ధ్యం, వైద్యం, విద్యుత్‌, ఇంజినీరింగ్‌, రవాణా తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఆ మేరకు ఏర్పాట్లను చేపట్టారు. ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. పాపాఘ్ని నదిలో మహిళలు స్నానం చేసిన అనంతరం దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక వసతిని కల్పిస్తున్నట్లు ఆలయ అధికారి వివరించారు. గండి ఉత్సవాల సందర్భంగా పోస్టర్లు, ఆహ్వాన పత్రికలు, కరపత్రాలు చక్రాయపేట ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ బ్యాంకు తరపున ఉచితంగా ఇస్తున్నట్లు మేనేజర్‌ భానుచందర్‌ తెలిపారు. పాసులు కలిగిన వారు, వీఐపీలకు ఉదయం 5 గంటల నుంచి 8గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆలయ చైర్మన్‌ కావలి కృష్ణతేజ, అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు.

గండి అంజన్న సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నేతలు



గండి అంజన్నకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామిని మంగళవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి, కడప మునిసిపల్‌ కార్పొరేషన్‌ మేయర్‌ కొత్త మద్ది సురేష్‌బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్‌, అర్చకుడు రఘు స్వామి వారిచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారి వెంట వ్యవసాయ శాఖ మాజీ సలహాదారు సంబటూరు ప్రసాదరెడ్డి, చక్రాయపేట జెడ్పీటీసీ సభ్యుడు తాటిగొట్ల శివప్రసాదరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే, ఆమె భర్త అండతోనే తిరుమలేష్‌ అవినీతి అక్రమాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త

కడప కార్పొరేషన్‌ : కడప ఎమ్మెల్యే ఆర్‌.మాధవి, ఆమె భర్త టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి(వాసు) అండతోనే వారి అనుచరుడు టీఎన్‌ఎస్‌ఎఫ్‌ వైఎస్సార్‌ కడప జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్‌ అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయి దత్త ఆరోపించారు. కడపలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి విభాగం నాయకుడిగా విద్యార్థి సమస్యలపై పోరాడకుండా అక్రమ వసూళ్లు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నాడన్నారు. తాను చేస్తున్న అక్రమాలకు ఎమ్మెల్యే మాధవి రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పేరు చెప్పుకుని అందరినీ బెదిరించాడన్నారు. మహానాడు సందర్భంగా జిల్లాలో విద్యాసంస్థల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడని ఆరోపించారు. ఎమ్మెల్యే మెప్పు కోసం మేయర్‌ సురేష్‌ బాబు ఇంటిపై చెత్త వేశాడని, ఎలాంటి సంబంధం లేకపోయినా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌ బాషా ఇంటి వద్ద ధర్నా చేయించాడన్నారు. సాక్షి కార్యాలయం లోపలికి చొరబడి దాడి చేసేందుకు కూడా ప్రయత్నించాడన్నారు. రాష్ట్ర విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి సందీప్‌రెడ్డి, నగర అధ్యక్షుడు శివారెడ్డి, జబ్బార్‌, నౌమాన్‌, విష్ణువర్ధన్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ హానిపై ప్రజలకు విస్తృత అవగాహన



మాట్లాడుతున్న రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌ డాక్టర్‌ పి.కృష్ణయ్య

కడప సెవెన్‌రోడ్స్‌ : ప్లాస్టిక్‌ వినియోగం వల్ల జరిగే హానిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌ డాక్టర్‌ పి.కృష్ణయ్య అధికారులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి కలెక్టర్‌ అదితిసింగ్‌తో కలిసి ఆయన అధికారులతో ఈ అంశంపై సమీక్షించారు. ప్లాస్టిక్‌ వాడకాన్ని అరికట్టేందుకు ప్రధానంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో అవగాహనతోపాటు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. మార్కెట్లు, హోల్‌సేల్‌లను తనిఖీలు చేసి నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానాలు విధించాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా క్లాత్‌ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్లాస్టిక్‌ రహిత గ్రామాలుగా మార్చేందుకు గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేయాలన్నారు. దేవాలయాల్లో ప్రసాదం, అన్నదానం పంపిణీకి ప్లాస్టిక్‌ వినియోగాన్ని అరికట్టాలన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌ అదితిసింగ్‌ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎంపీడీఓలు, మున్సిపల్‌ కమిషనర్లకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుధ, పరిశ్రమలశాఖ జీఎం చాంద్‌బాషా, ఏపీఐఐసీ జోనల్‌ మేనేజర్‌ శ్రీనివాసమూర్తి, మున్సిపల్‌ కమిషనర్‌ మనోజ్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి



మృతి చెందిన ఖాదర్‌ఖాన్‌

పీలేరురూరల్‌ : వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శశి ఆర్థో హాస్పిటల్‌లో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లె మండలం కేవీపల్లెకు చెందిన పి. ఖాదర్‌ ఖాన్‌ (47) పీలేరు ట్రాన్స్‌కో కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పీలేరు పట్టణంలోని శ్రీ లక్ష్మీ హాస్పిటల్‌లో చేరాడు. పరిశీలించిన వైద్యులు కిడ్నీలో రాళ్లు ఉన్నాయని శశి ఆర్థో హాస్పిటల్‌కు రెఫర్‌ చేశారు. సోమవారం శశి హాస్పిటల్‌లో చేరాడు. సోమవారం సాయంత్రం 4 గంటలకు తిరుపతి నుంచి కిడ్నీ శస్త్రచికిత్స వైద్య నిపుణులు వచ్చి ఆపరేషన్‌ చేశారు. అయితే మంగళవారం సాయంత్రం ఖాదర్‌ఖాన్‌ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే నిండుప్రాణం పోయిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్‌ శశిభూషణ్‌రెడ్డిని వివరణ కోరగా ఆపరేషన్‌ చేసి 24 గంటలైందని, ఇక డిశ్చార్జి చేయాలనుకున్న సమయంలో మృతి చెందాడని తెలిపారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య తోపాటు, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి





సిద్దవటం: రైల్వే ట్రాక్‌పై మృతదేహం, కడప రైల్వేస్టేషన్‌లో మృతదేహం

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప రైల్వేస్టేషన్‌ ప్లాట్‌ఫారం–1పై మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని కడప రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వేస్టేషన్‌ తూర్పు వైపున ప్రయాణికులు కూర్చొనే స్టాండ్‌పై మృతదేహాన్ని గుర్తించామన్నారు. మృతుడు యాచకునిగా భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని రిమ్స్‌ మార్చురీలో భద్రపరిచామని, గుర్తించిన వారు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

ఉప్పరపల్లె రైల్వే ట్రాక్‌ వద్ద..

సిద్దవటం: ఉప్పరపల్లె గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్‌ వద్ద గురు తెలియని వ్యక్తి మృతదేహం(55) లభ్యమైంది. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఇతను రెండు రోజుల కింద మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఇతను ప్రమాద వశాత్తు రైలులోనుంచి కింద పడ్డాడా, లేదా ఎవరైనా చంపి పడేశారా అనే కోణంలో విచారిస్తున్నట్లు కడప రైల్వే ఎస్‌ఐ సుదర్శన్‌ రెడ్డి తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించామన్నారు.

ఎర్రచందనం కేసులో నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు సుబ్రమణ్యం

నందలూరు : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న రాజంపేట మండలం రేణింతల అరుంధతివాడకు చెందిన పాటూరు సుబ్రమణ్యం అలియాస్‌ మణిని అరెస్టు చేసి తిరుపతి ఆర్‌ఎస్‌ఎస్‌ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం కేసులో నిందితుడిగా ఉండి కోర్టు వాయిదాలకు హాజరు కానందున కోర్టు అతనిపై నాన్‌ బెయిలబుల్‌ వారంట్‌ ఇచ్చిందన్నారు. అతన్ని తమ సిబ్బంది పట్టుకొని తిరుపతి స్పెషల్‌ ఆర్‌ఎస్‌ఎస్‌ కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్‌ నిమిత్తం రాజంపేట సబ్‌ జైలుకు తరలించిందన్నారు.